సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం | 4 | నవంబర్ | 2023


జిల్లాకు తిరుమల ప్రచార రథం

సిరిసిల్లటౌన్: తిరుమలేశుని ప్రచార రథం శుక్రవారం కార్మిక క్షేత్రం సిరిసిల్లకు చేరింది. హనుమాన్ దీక్ష సేవాసమితి వ్యవస్థాపక పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ ప్రవచనాలు భక్తులను అలరించాయి. జనవరి 21న తిరుపతి వేంకటేశ్వర యూనివర్సిటీలో లక్షమందితో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ సంకీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

నేను ఓటు వేస్తాను



సిరిసిల్ల: కలెక్టరేట్‌లో శుక్రవారం సెల్ఫీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 'నేను ఓటు వేస్తాను.. ఎందుకంటే.. మాది రాజన్న సిరిసిల్ల' అనే నినాదంతో సెల్ఫీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్వీప్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సెల్ఫీ కేంద్రంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ ఫొటో దిగారు. ఓటు ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని, అందరూ ఓటు హక్కును విని యోగించుకోవాలని కలెక్టర్, ఎస్పీలు కోరారు. వీరితోపాటు అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, డీపీఆర్వో ఎం.దశరథం సెల్ఫీలు దిగారు. ఎన్నికలు పూర్తి అయ్యేంత వరకు ఈ సెల్ఫీ కేంద్రాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

ప్రజలకు 'గ్యారంటీ'

- కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం



బోయినపల్లి(చొప్పదండి): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని బూర్గుపల్లి, దుంద్రపల్లి, స్తంభంపల్లి, గుండన్నపల్లిల్లో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. నాయకులు పెంచాల సత్తయ్య, డబ్బు రాధవెంకటరెడ్డి, గడ్డం తిరుపతిరెడ్డి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, కత్ర సత్యప్రసన్న, మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనకయ్య, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, పులి లక్ష్మీపతి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, బోయిని ఎల్లేశ్ తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌కే మా మద్దతు

- శ్రీగాథ ముదిరాజ్‌ల ఏకగ్రీవ తీర్మానం



గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని శ్రీగాథ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు మంత్రి కేటీఆర్‌కే తాము మద్దతు ఇస్తున్నట్లు తీర్మానించారు. ఈమేరకు శుక్రవారం సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్‌ను ఈసారి భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. నాయకులు పర్శ శ్రీనివాస్, పర్శ రవి, చంద్రయ్య, నారాయణ, పోచయ్య, నర్సింలు, రేణుక, నర్సవ్వ, ఎల్లవ్వ, రాజవ్వ, లావణ్య, సుజాత, భాగ్య, రాధ, లత, మహేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చేతిగుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు అవకాశం కల్పించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

నేరెళ్ల గురుకులంలో డీఈవో



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల బాలికల గురుకుల పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. 6, 9వ తరగతుల విద్యార్థుల పరీక్షలను పరిశీలించారు. చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాధ, విద్యార్థినులు పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

మంచి.. చెడు గుర్తించండి

- కోరుట్ల బిడ్డ సంజయ్‌ను ఆశీర్వదించండి
- ప్రజల కష్టాలు తెలిసినవాడు
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

జంగ్ తెలంగాణ

కోరుట్ల: యువకుడు.. వైద్యుడు.. కోరుట్ల బిడ్డ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను ఆశీర్వదించాలని సీఎం కేసీఆర్ కోరారు. శుక్రవారం కోరుట్ల ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. మంచి, చెడు ఆలోచించి ప్రజల కష్టాలు తెలిసిన సంజయ్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీల చరిత్ర, నడవడిక అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏంసేవ చేశారన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓటును సద్వినియోగం చేయాలన్నారు. గతంలో కోరుట్లకు చాలాసార్లు వచ్చానని ఇక్కడి చేనేత, బీడీ కార్మికుల కష్టాలు తెలుసన్నారు. అందుకే ఎవరు అడగకున్నా చేనేత కార్మికులకు పింఛన్లు, బీడీ కార్మికులకు జీవనభృతి ఇస్తున్నామని వివరించారు. పేదల సంక్షేమం కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ దిశలో లెక్కలేని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కోరుట్ల సెగ్మెంట్‌లో రెండు రెవెన్యూ డివిజన్లతోపాటు తాను బండలింగాపూర్‌కు వచ్చిన సమయంలో చెరువులు చూశామని, అక్కడి ప్రజలు మండలంగా మార్చాలని కోరితే ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో రూ.70 నుంచి రూ.200 పింఛన్ చూశామని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రూ.2వేలు చేశామన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో పింఛన్ ఏడాదికి రూ.500 చొప్పున రూ.5వేలకు చేరుతుందని పేర్కొన్నారు.

డాక్టర్ సంజయ్ నా ప్రాణాలు కాపాడాడు

కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ 2009లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేపట్టిన నిరాహార దీక్ష సమయంలో వైద్యుడిగా తన వెంట ఉండి ప్రాణాలు కాపాడారని సీఎం అన్నారు. యువకుడు, వృత్తిపరంగా వైద్యుడు సంజయ్ తలుచుకుంటే వైద్య వృత్తిలో కోట్ల రూపాయలు సంపాదించవచ్చు, కానీ తండ్రి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు బాటలో ప్రజాసేవ కోసం మీ ముందుకు వచ్చాడు. ఆయనను మీరంతా ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని కేసీఆర్ కోరారు.

అభివృద్ధి చేశా.. సంజయ్‌ను గెలిపించండి: ఎమ్మెల్యే కల్వకుంట్ల

కోరుట్ల సెగ్మెంట్‌లోని కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలతోపాటు మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో పూర్తిస్థాయి అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానని ఆరోగ్యం సహకరించకపోవడంతో తన తనయుడు డాక్టర్ సంజయ్‌ను అభ్యర్థిగా నిలిపానన్నారు. తన చివరి శ్వాస వరకు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. అందరూ అండగా నిలిచి సంజయ్‌ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

కేసీఆర్ దీక్ష స్ఫూర్తి: బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమనేత కేసీఆర్ దీక్ష స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ప్రజాఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ, 'నేను మీ గడ్డ మీద పుట్టిన బిడ్డను.. మీరు పీల్చిన గాలి పీల్చినవాన్ని..మీ కష్టసుఖాల్లో నాన్నతోపాటు పాలుపంచుకున్న.. ఈ ఎన్నికల్లో నన్ను ఆదరించండి' అని కోరారు. కోరుట్లలో వరద కాల్వలో క్రికెట్ ఆడేవాళ్లం, ఇప్పుడు నిండా నీటితో కళకళలాడుతోందని తెలిపారు. మీకు సీఎం కేసీఆర్ చాలా చేశారు. ఇంకా కొంత మంది బీడీ కార్మికులకు జీవనభృతి రావాలని, వారందరికీ ఇవ్వాలన్నారు. ఎంపీగా బీజేపీ అర్వింద్‌కు అవకాశం ఇచ్చారు. అర్వింద్ ఐదేళ్లలో చేసింది గుండుసున్నా అన్నారు. సభలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎల్.రమణ, జెడ్పీ చైర్మన్ దావ వసంత, గొడిసెల రాజేశంగౌడ్, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాప్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మున్సిపల్ చైర్మన్లు అన్నం లావణ్య, రనవేని సుజాత, జెడ్పీటీసీలు దారిశెట్టి లావణ్య, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కంటాల భారతి, ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి, కాటిపెల్లి సరోజన, జాజల భీమేశ్వరి, కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్

కోరుట్ల/కోరుట్లరూరల్: కోరుట్ల శివారులో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణానికి మధ్యాహ్నం 2 గంటలకే భారీ సంఖ్యలో జనం చేరుకున్నారు.

- సభాప్రాంగణం పూర్తిగా జనంతో నిండిపోవడంతో ఇంకా వేలాది మంది జాతీయ రహదారిపై నిలబడి వీక్షించారు.
- సభలో కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.
- ఆర్మూర్ నుంచి సాయంత్రం 4.42 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకున్న కేసీఆర్.. ఆ తర్వాత 4.45 గంటలకు సభాస్థలికి వచ్చారు.
- ముందుగా సభలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడి ఒక నిమిషంలోనే ప్రసంగాన్ని ముగించారు.
- తర్వాత కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ 4 నిమిషాలు మాట్లాడి పలు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు.
- అనంతరం 4.51 గంటలకు కేసీఆర్ ప్రసంగం మొదలుపెట్టి 5.08 గంటలకు ముగించారు.
- ప్రసంగం చివరలో ఒక నిమిషం మైనార్టీలను ఉద్దేశించి హిందీలో మాట్లాడారు.
- 5.14 గంటలకు సీఎం కేసీఆర్ హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిద్దాం

- నామినేషన్లకు సర్వం సిద్ధం
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిద్దామని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్ల ఆర్డీవో, వేములవాడ తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 13న పరిశీలన, 15న ఉపసంహరణ.. అనంతరం అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని వివరించారు. ఈనెల 30న పోలింగ్, డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టి గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిపారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితోపాటు మరో నలుగురిని అనుమతిస్తారని, ఆర్వో ఆఫీస్‌కు 100 మీటర్ల దూరంలోకి అభ్యర్థికి సంబంధించిన మూడు వాహనాలను అనుమతిస్తారని తెలిపారు.

జిల్లాలో 80 సమస్యాత్మక ప్రాంతాలు: ఎస్పీ అఖిల్ మహాజన్

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు ప్రలోబపరిచే వస్తువులు సరఫరా కాకుండా జిల్లా సరిహద్దుల్లో ఏడు చెక్‌పోస్ట్‌లు, ఐదు డైనమిక్ చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్ట్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నామినేషన్ కేంద్రాల వద్ద 50 మందితో భద్రత ఏర్పాటు చేశామని వివరించారు. ఇప్పటికే జిల్లాకు రెండు కంపెనీల కేంద్ర పోలీస్ బలగాలు వచ్చాయని, మరో నాలుగు కంపెనీల బలగాలు వస్తాయన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్స్ సర్వేలైన్స్ బృందాలు పనిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 80 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్, డీపీఆర్వో ఎం.దశరథం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉండాలి

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 547 పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి, వసతులపై నివేదిక సమర్పించారని తెలిపారు. జిల్లాలోని 198 పోలింగ్ కేంద్రాల్లో కొన్ని వసతులు సరిగా లేవని నివేదిక అందిందని, ఇప్పటికే 157 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. మిగతా కేంద్రాల్లో త్వరగా మెరుగుపరచాలని కలెక్టర్ కోరారు. సెక్టోరియల్ అధికారులు మరోసారి సందర్శించి.. సోమవారం లోగా నివేదిక సమర్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు అన్వేశ్, మీర్జా ఫసత్ అలీ బేగ్ పాల్గొన్నారు.



'చావు'కొచ్చిన ఆంక్షలు

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎన్నికల నామినేషన్ల కోసం పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆర్డీవో ఆఫీస్ వద్ద వన్‌వే చేశారు. పాతబస్టాండుకు చెందిన హోటల్ నిర్వాహకుడు శుక్రవారం చనిపోయాడు. ఆయన అంతిమయాత్ర సాగుతుండగా.. ట్రాఫిక్ ఆంక్షలు వైకుంఠరథానికి అడ్డుగా వచ్చాయి. 'సెస్' ఆఫీస్ ముందు వన్ వేలో శవయాత్ర సాగింది. శుక్రవారం ఒక్కరూ కూడా నామినేషన్ వేసేందుకు ముందుకురాలేదు. కానీ పోలీసు ట్రాఫిక్ ఆంక్షల్లో శవయాత్ర సాగాల్సి వచ్చింది. ఈ ఎన్నికల ముందస్తు ఆంక్షలు సిరిసిల్లలో 'చావు'కొచ్చాయని అంతిమయాత్రలో పాల్గొన్న వారు లోలోపల గుణుక్కున్నారు.

ప్రచార ఖర్చు నమోదు చేయాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి



మాట్లాడుతున్న వ్యయపరిశీలకుడు

సిరిసిల్ల: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ప్రచార ఖర్చుల వివరాలు నమోదుచేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి పేర్కొన్నారు. సిరిసిల్ల పీఆర్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి, ప్రత్యేకాధికారి, ఎక్సైజ్, ఆదాయపన్ను నోడల్ అధికారులు, సహాయ వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్ టీమ్ సభ్యులతో సమావేశమయ్యారు. మణిగండసామి మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఎన్నికల్లో పోటీచేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచార ఖర్చుల వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్, వీఎస్టీ, వీవీటీలు నమోదు చేయాలని సూచించారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలను సర్వేలైన్స్ టీమ్ సభ్యులు వీడియోతీసి.. పరిశీలించి వివరాలను అకౌంటింగ్ టీంకు అందించాలన్నారు. నిర్ణయించిన రేట్ల ప్రకారం వ్యయం నమోదు చేయాలన్నారు. ఎన్నికల వ్యయాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులైన తనకు మొబైల్ నంబర్ 8977124147లో తెలియజేయాలని లేదంటే సిరిసిల్లలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామకృష్ణ, ప్రత్యేకాధికారి స్వప్న, మీడియా నోడల్ అధికారి మామిండ్ల దశరథం, ఎక్సైజ్ జిల్లా నోడల్ అధికారి పంచాక్షరీ, ఆదాయపన్ను నోడల్ అధికారి లాలూన్, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

జిల్లా వ్యయ పరిశీలకులను కలిసిన కలెక్టర్

కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా జిల్లాకు నియమితులైన వ్యయ పరిశీలకుడు మణిగండసామిని కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సిరిసిల్ల పీఆర్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

- సిరిసిల్ల, వేములవాడల్లో దాఖలు కాని దరఖాస్తులు
- రిటర్నింగ్ అధికారి ఆఫీస్ వద్ద మూడంచెల భద్రత
- ఆర్వో ఆఫీస్‌లను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్
- నామినేషన్ల స్వీకరణకు సిద్ధంగా ఉన్న అధికారులు



సిరిసిల్ల ఆర్వో ఆఫీస్‌లో అధికారులు

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో తొలి రోజు శుక్రవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ల స్వీకరణకు సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్‌లు షెడ్యూల్‌ను విడుదల చేశారు. రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లలో నామినేషన్ పత్రాలను అందించే కేంద్రం, డిపాజిట్లు స్వీకరించే కౌంటర్, కంట్రోల్ రూం, హెల్ప్‌డెస్క్, నామినేషన్ ఫెసిలిటేషన్ కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఆర్వో ఆఫీస్‌లోనూ తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కూడిన బృందాన్ని ఉంచారు. మంచి ముహూర్తం చూసుకుని నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌కు వచ్చి నామినేషన్ పత్రాలను తీసుకెళ్లారు. ఒక్కో అభ్యర్థి డమ్మీ నామినేషన్ పత్రంతోపాటు మరో నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లాలోని రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లను అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, ఫెసిలిటేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నామినేషన్లు స్వీకరించాలని ఆర్వోలకు సూచించారు.

మూడంచెల భద్రత

నామినేషన్ దాఖలు చేసే సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్, వేములవాడ తహసీల్దార్ ఆఫీస్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ముందుగా వాహనాలు, ఊరేగింపులు రాకుండా కట్టడి చేసేందుకు బారికేడ్లతో కూడిన ఆంక్షలను విధించారు. రెండో దశలో ఆర్డీ ఆఫీస్‌లోకి వెళ్లేవారికి అనుమతి ఇస్తున్నారు. మూడో దశలో ఆర్వో ఆఫీస్‌లోకి వెళ్లే వారిని నిశితంగా తనిఖీ చేసి పంపిస్తున్నారు. సిరిసిల్ల కేంద్రాన్ని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, టౌన్ సీఐ ఉపేందర్‌లు పరిశీలించి పోలీస్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వేములవాడ కేంద్రాన్ని ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి పరిశీలించారు. కేంద్రం ద్వారా జిల్లాకు వచ్చిన సాయుధ పోలీస్ బలగాలతో భద్రత కల్పించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను కల్పించారు. తొలిరోజు సిరిసిల్ల, వేములవాడల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడం గమనార్హం.



ఓటు అనేది ప్రతీపౌరుడి హక్కు. మన ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడే బాధ్యత మనదే

– హిల్లరీ క్లింటన్

మీకు తెలుసా..?

అభ్యర్థుల తప్పుడు వివరాలపై మీరూ ఫిర్యాదు చేయొచ్చు

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ఘట్టం ప్రారంభం కాబోతుండగా సామాన్యులూ ఎన్నికల క్రతువులో భాగం కావొచ్చు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తమ విద్య, వ్యాపారం, ఆస్తులు, అప్పులు, నేరచరిత, వారసత్వ సంపదను వారి అఫిడవిట్‌లో పొందుపరచాలి. దీన్ని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. కొందరు తమ వివరాలను తప్పుగా చూపే అవకాశం కూడా ఉంది. అయితే.. అభ్యర్థులు సమర్పించిన వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే, లేదంటే ఫిర్యాదులు ఉంటే ఎవరైనా తెలియజేయొచ్చు. నేరుగా వారిపై ఫిర్యాదు చేయొచ్చు. అభ్యర్థి తన నామినేషన్ పత్రాన్ని సంబంధిత అధికారికి అందించిన వెంటనే ఆన్‌లైన్ ద్వారా ఎన్నికల సంఘానికి పంపిస్తారు. అనంతరం ఆ కార్యాలయ నోటీస్ బోర్డుపై అభ్యర్థుల అఫిడవిట్ ఉంచుతారు. వీటిని ఎవరైనా పరిశీలించి, సమాచారం తప్పుగా ఉన్నట్లు తెలిస్తే అభ్యంతరాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- ప్రింటింగ్‌ప్రెస్ యజమానులతో సమావేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: ప్రింటింగ్‌ప్రెస్, ఫ్లెక్సీ ప్రింటర్స్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశమయ్యారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, 127 'ఏ' సెక్షన్ ప్రకారం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రచార కరపత్రాలు, పోస్టర్లను, ఫ్లెక్సీలను ప్రింట్ చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరపత్రాలు, పోస్టర్లు, ఇతర మెటీరియల్ ముద్రించేటప్పుడు ప్రచురణకర్త పేర్లు, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్లు స్పష్టంగా ముద్రించాలని సూచించారు. ప్రచురణకర్త డిక్లరేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఆఫీస్‌లో సమర్పించాలన్నారు. జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామకృష్ణ, ప్రత్యేకాధికారి స్వప్న, మీడియా నోడల్ అధికారి మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

బీజేపీ పాలనతోనే ప్రజలకు మేలు



బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో బీజేపీ పాలనతోనే ప్రజలకు మేలు కలుగుతుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు బొడిగె శోభ పేర్కొన్నారు. మండలంలోని నీలోజిపల్లి, కొత్తపేట, మాన్వాడ, మల్లాపూర్, నర్సింగాపూర్, మర్లపేట గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, నర్సింహాచారి, ప్రభు, హరీశ్, శ్రీనివాసరెడ్డి, మోహన్‌బాబు, అనిల్, బాలయ్య, బాల్‌రెడ్డి, శ్రీహరి, నాగరాజు ఉన్నారు.

క్లుప్తంగా

విశ్వరూప మహాసభ విజయవంతం చేయండి

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కోనరావుపేట(వేములవాడ): హైదరాబాద్‌లో ఈనెల 11న నిర్వహించే 'విశ్వరూప మహాసభ'ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు. కోనరావుపేటలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని విశ్వరూప మహాసభ వేదికగా కోరనున్నట్లు తెలిపారు. భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పటిక, బెల్లం పట్టివేత



గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ వద్ద ఎక్సైజ్‌శాఖ అధికారులు, పోలీసులు శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నాటుసారా ముడి పదార్థాలు పటిక, బెల్లం లభించాయి. రవాణా చేస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని, రవాణాదారులైన రామకృష్ణ, రజితలపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

- సీఐ శశిధర్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని సీఐ శశిధర్‌రెడ్డి కోరారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులో శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 15 వాహనాలకు జరిమానా విధించారు. తనిఖీల్లో ఎస్సై రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డెరులను విస్మరిస్తున్న పార్టీలు



సిరిసిల్లఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల్లో వడ్డెరులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించకుండా అన్ని పార్టీలు విస్మరిస్తున్నాయని జిల్లా వడ్డెరకుల సంఘం జిల్లా నాయకులు పల్లపు లక్ష్మణ్, సూర దేవరాజు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వడ్డెరుల నుంచి ఓట్లను దండుకునేందుకు అన్ని పార్టీలు యత్నిస్తున్నాయన్నారు. ఏ పార్టీ కూడా వడ్డెరులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించకుండా అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కోశాధికారి దండుగుల తిరుపతి, పిట్ల వెంకట్, గండికోట రాజు, శివరాత్రి అయిలయ్య, నాంపెల్లి తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్‌బాపూజీ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ



పట్టుబడ్డ నగదును లెక్కిస్తున్న అధికారులు

తనిఖీలు ముమ్మరం..

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోనూ పోలీస్ చెకింగ్ చేపడుతున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఫస్ట్ బైపాస్ రోడ్డు వద్ద తనిఖీలు చేపడుతుండగా దొరికిన డబ్బును పోలీసులు సీజ్ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

బీఆర్‌ఎస్‌తో అన్ని వర్గాలకు భరోసా



ఎదురుగట్లలో లక్ష్మీనరసింహారావు ప్రచారం

వేములవాడరూరల్: అన్ని వర్గాలకు బీఆర్‌ఎస్ భరోసా కల్పిస్తుందని వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం చెక్కపల్లి, అచ్చన్నపల్లి, ఎదురుగట్ల గ్రామాల్లో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఎదురుగట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మొక్కులు చెల్లించుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, జెడ్పీటీసీ ఏశ వాణి, ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, రూరల్ సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, గొస్కుల రవి, సర్పంచ్ జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ వెలుమ నర్సవ్వ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వెలుమ బాల్‌రెడ్డి, మైసయ్య, గడ్డం హన్మాండ్లు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి



ఫాజుల్‌నగర్ వద్ద చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి

సిరిసిల్ల: జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల తనిఖీలు పక్కాగా చేపట్టాలని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి సూచించారు. జిల్లా సరిహద్దులోని వేములవాడరూరల్ మండలం ఫాజుల్‌నగర్, బోయినపల్లి మండలం కొదురుపాక చెక్‌పోస్టులను శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు నగదు, బంగారం, ఇతరత్ర కానుకలు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఈ ప్రక్రియను చిత్రీకరించాలని సూచించారు. ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు, బంగారం వంటివి తరలిస్తే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామకృష్ణ, ప్రత్యేక అధికారిణి స్వప్న ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం లేదు

- కాంగ్రెస్‌లో చేరిన సారంపల్లి, రాంచంద్రాపూర్ వాసులు
- కండువాలు కప్పి ఆహ్వానించిన కే.కే. మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సారంపల్లి, రాంచంద్రపూర్ గ్రామస్తులు

సిరిసిల్లటౌన్: ప్రజల కోసం పనిచేసే వారికి అధికార బీఆర్‌ఎస్‌లో సముచిత స్థానం లేదని సారంపల్లి, రాంచంద్రాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి సమక్షంలో తంగళ్లపల్లి మండలం సారంపల్లి నుంచి 80, రాంచంద్రాపూర్ నుంచి 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలో విస్తృత ప్రచారం చేపట్టారు. టోని, చొప్పదండి ప్రకాశ్, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ



మాట్లాడుతున్న మందకృష్ణ

సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా పోరాడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశానికి సంబంధించిన సన్నాహక మీటింగ్ శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లతో మాదిగలు, ఉపకులాల ప్రజలు ఎంతో అన్యాయానికి గురవుతున్నారన్నారు. 1994లో ఎగిసిన ఉద్యమానికి స్పందించిన అప్పటి టీడీపీ సర్కారు 1996లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వేసిందని, అప్పటి నుంచి బిల్లు పాస్ కావడం లేదన్నారు. మాదిగలు, ఉపకులాల హక్కుల సాధన, భవిష్యత్ తరాల సంక్షేమం వర్గీకరణ ద్వారానే సాధ్యమన్నారు. హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప సభకు లక్షలాదిగా తరలిరావాలని కోరారు. కత్తెర దేవదాసు, ఆకునూరి బాలరాజు, కానాపురం లక్ష్మణ్, సంఘం సభ్యులు, బుడగ జంగాల నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే చర్యలు

- సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్



తంగళ్లపల్లి(సిరిసిల్ల): శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్ హెచ్చరించారు. ఇల్లంతకుంట మండలంలోని రేపాక, సోమారంపేట, పెద్దలింగాపూర్, గొల్లపల్లి, వెంట్రావుపల్లి, రామోజీపేటల్లో శుక్రవారం కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్, హెడ్ కానిస్టేబుల్స్ భూమయ్య, ఫసియొద్దీన్, కానిస్టేబుళ్లు మధు, లక్ష్మీనారాయణ, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఎన్నికలు



వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ఉన్నందున పోలీస్‌శాఖ కేంద్ర సాయుధ బలగాలతో మండలంలోని ఫాజుల్‌నగర్, వట్టెంల, నూకలమర్రి, ఎదురుగట్ల, మర్రిపల్లి, లింగంపల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఏఎస్పీ చంద్రయ్య పాల్గొని అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలందరూ సహకరించాలని కోరారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్‌ఐ మారుతి పాల్గొన్నారు.

రాచర్లగొల్లపల్లి వాసికి డాక్టరేట్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన అందె కిష్టయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'తెలంగాణ ఉద్యమంలో సాహితీ, సాంస్కృతిక సంస్థల పాత్ర–ఒక పరిశీలన 1969-2010' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ఆర్ వెంకటేశం పర్యవేక్షణలో పరిశోధనకు కిష్టయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనివర్సిటీ 83వ స్నాతకోత్సవం సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

బైండోవర్ అతిక్రమించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా


- సీఐ చంద్రశేఖర్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన మండల కేంద్రానికి చెందిన కిరాణా వర్తక వ్యాపారికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎల్లారెడ్డిపేటలో కిరాణా వ్యాపారం చేస్తున్న మామిండ్ల రాజు నాటుసారాయి తయారీ ముడి పదార్థాలు బెల్లం, పటిక విక్రయిస్తుండగా గతేడాది మే 22న తహసీల్దార్ జయంత్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. రెండేళ్ల వరకు ఎక్సైజ్ నేరాలకు పాల్పడబోనని షరతులతో కూడిన పత్రాన్ని రాసి ఇచ్చారు. కాగా గత నెల 18న బెల్లం, పటిక విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వివరించారు. బైండోవర్ నిబంధనలను అతిక్రమించి మళ్లీ నేరానికి పాల్పడడంతో రాజుకు రూ.లక్ష జరిమానా విధించినట్లు వివరించారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ/వేములవాడఅర్బన్/వేములవాడరూరల్/రుద్రంగి(వేములవాడ): బీసీ బిడ్డగా మీ ముందుకొస్తున్నా.. ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించండి.. అని వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. నాంపల్లిలో 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. సింగిల్‌విండో డైరెక్టర్లు కాశ శ్రీనివాస్, జడల రవికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, చిలివేరి శ్రీనివాస్, దండుగుల నాంపల్లి, బొజ్జ భారతి, నాగరాజు, శ్రీనివాస్, నీలం గురువయ్య, రాజేందర్, సాగర్, తిరుపతి ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వేములవాడ టీడీపీ రాష్ట్ర నాయకుడు పులి రాంబాబుగౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి ముంజ ఉపేందర్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు ముప్పిడి శ్రీధర్, రాష్ట్ర యువత నాయకుడు వలీ మహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిషన్, ప్రవీణ్‌గౌడ్, రమేశ్‌తోపాటు పలువురు కార్యకర్తలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారు మాట్లాడుతూ బీసీ బిడ్డ ఎదగడం ఓర్వలేక దాడులకు దిగుతున్నారన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా

వేములవాడ మండలం హన్మాజీపేటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఏళ్లుగా ఈ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానన్నారు. రూరల్ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, ఎంపీటీసీ శ్యామల, లింగంపల్లి సర్పంచ్ సామ కవిత, నాయకులు తిరుపతిరెడ్డి, గోవర్దన్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్ ఉన్నారు.

రుద్రంగి గ్రామం ఏకం కావాలి

రుద్రంగి బిడ్డగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నా.. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటా.. రుద్రంగి గ్రామం మొత్తం ఏకమై మద్దతు తెలపాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. రుద్రంగిలో గడప..గడపకు ప్రచారం చేసి మాట్లాడారు. నాయకులు తూము జలపతి, సామ మోహన్‌రెడ్డి, చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పాదయాత్ర చేస్తా

- సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణీరుద్రమరెడ్డి



ముస్తాబాద్‌లో ప్రచారం చేస్తున్న రుద్రమదేవి

సిరిసిల్ల/ముస్తాబాద్(సిరిసిల్ల): నియోజకవర్గంలోని ప్రతి ఊరిలో పాదయాత్ర చేస్తానని బీజేపీ అభ్యర్థి రాణీరుద్రమరెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని బీజేపీ ఆఫీస్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. పట్టణంలోని 39 వార్డులను, నియోజకవర్గంలోని 114 గ్రామాల్లోనూ పాదయాత్ర చేస్తానని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ నాయకులు రెడ్డబోయిన గోపి ఉన్నారు.

బీజేపీతోనే బీసీలకు రాజ్యాధికారం

వెనుకబడిన వర్గాలతోపాటు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాధికారం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ సిరిసిల్ల అభ్యర్థి రుద్రమదేవి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో బీజేపీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రుద్రమదేవి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని సీఎం చేస్తామని ప్రకటించిన దమ్మున్న పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, మండలాధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి, సంజీవ్, పద్మ, అంజాగౌడ్, శ్రీనివాస్‌రావు, క్రాంతి, మహేందర్, గోపి, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీతోనే సుపరిపాలన

గంభీరావుపేట(సిరిసిల్ల): బీజేపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి రాణిరుద్రమరెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేటలో పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదన్నారు. తనను గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, జిల్లా నాయకులు పత్తి స్వామిరాజ్, లక్ష్మీపురం రాజు, సర్వోత్తం, మాండ్ల లక్ష్మణ్, అన్వర్, మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

8న అమరుల కుటుంబాలతో నామినేషన్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఈనెల 8న అమరవీరుల కుటుంబాలతో నామినేషన్లు వేస్తామని అమరవీరుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామారెడ్డి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది అమరులయ్యారని, కానీ ఏనాడు బీఆర్‌ఎస్ పార్టీ అమరుల కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట, కామారెడ్డి నియోజకవర్గాల్లో అమరవీరుల కుటుంబాలకు చెందిన 200 మందితో నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు.

పద్మశాలి బిడ్డగా పోటీలో ఉంటా

- మనస్థాపంతో బీజేపీకి రాజీనామా
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్



రాజీనామాపత్రం చూపిస్తున్న లగిశెట్టి శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: బీజేపీ సిరిసిల్ల నుంచి బీసీలకు టిక్కెట్ ఇస్తుందని నమ్మించి మోసం చేసిందని.. బండి సంజయ్ ప్రమేయంతో పార్టీలో చేరానని.. మాట నెరవేర్చని పార్టీకి రాజీనామా చేస్తున్నానని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం అనుచరులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గంలో అత్యధికులు పద్మశాలీలు ఉన్నా.. బీసీలకు టిక్కెట్ ఇవ్వకుండా స్థానికేతరులకు టిక్కెట్ ఇచ్చారన్నారు. అందుకే పార్టీ సభ్యత్వానికి తనతోపాటు మరో పదిహేను మంది రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కొక్కుల భాస్కర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో ప్రజల మనసు గెలువలేరు

- ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య



మాట్లాడుతున్న గడ్డం నర్సయ్య

సిరిసిల్లటౌన్: బీజేపీ అభ్యర్థి ఓటమి భయంతో అబద్ధాలాడుతూ.. ప్రజల మనసు గెలువలేరని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య విమర్శించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థిని రాణిరుద్రమ ముందు సిరిసిల్ల చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. 2014కు ముందు ఎలా ఉన్న సిరిసిల్ల ఇప్పుడు ఎలా ఉందో కళ్లు తెరిచి చూడాలని సూచించారు. నిధులన్నీ సిరిసిల్లలో ఖర్చు చేస్తున్నారని ఓసారి, ఇక్కడ అభివృద్ధి జరుగలేదని మరోసారి మాట్లాడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ మాట్లాడుతూ సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చిన ఘనత కేటీఆర్‌కే దక్కిందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లపై నిందారోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, నాయకులు అన్నల్‌దాస్ వేణు, కంచర్ల రవిగౌడ్, బూర విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృత తనిఖీలు

- రూ.2.33 లక్షలు సీజ్



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఒక్క రోజే రూ.2.33 లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు చూపిస్తే గ్రీవెన్స్‌కమిటీకి రెండు రోజుల్లో రిలీజ్ చేయడానికి అవకాశం ఉందన్నారు. సీఐ ఉపేందర్, ఆర్ఎస్ఐ, బీఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన

సిరిసిల్లలోని ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు

సురక్షితం ఇలా!



గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధ పడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవ్యస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి.

మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటువ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.



● తగినంత నిద్ర

నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● ఫ్లూ టీకాలు

ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.



● పరిశుభ్రతను పాటించడం

ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్లపాటు సబ్బుతో చేతులను కడగాలి.

● తగినంత దూరం పాటించడం

తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్








* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్ళలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్ళను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్టరాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్



● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు

- నాని



● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పెట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు

- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...



● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది

- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి

- విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..



● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం

- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.